క్లుప్తంగా

గంగమ్మకు బోనాల సమర్పణ


గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు


బేతంచెర్ల: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ బేతంచెర్ల బైటిపేట కాలనీ వాసులు మంగళవారం గంగమ్మకు బోనాలు సమర్పించారు. కాలనీ వాసులందరూ సామూహికంగా డప్పు వాయిద్యాల నడుమ గంగమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీవాసులు తిరుమలేష్, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

నివాళి


నివాళులర్పిస్తున్న కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని కొండపేట కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తాహెర్(48) గుండె సంబంధిత వ్యాధితో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మంగళవారం ఆయన ఇంటి వద్దకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్‌జాహెద్ తదితరులు ఉన్నారు.

వర్షానికి కూలిన మిద్దె


కూలిపోయిన మట్టిమిద్దె

కోవెలకుంట్ల: పట్టణంలోని పాత శివాలయం సమీపంలో సోమవారం అర్ధ రాత్రి మంగలి మాధవకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. రెండు రోజుల నుంచి కోవెలకుంట్ల మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. పురాతన కాలంనాటి ఇల్లు కావడంతో వర్షానికి తడిచి దంతెలు విరిగిపోయి మిద్దె కూలిపోయింది. తల్లి, కుమారుడు వరండాలో నిద్రిస్తున్నారు. వంటగది కూలిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. వంటగదిలోని బియ్యం, కందిపప్పు, జొన్నలు, పప్పుదినుసులు, వంటసామగ్రి, తదితర వస్తువులు ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో రూ. 30 వేలు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

నానో ఎరువులు ఉత్తమం


నానో ఎరువులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

సంజామల: రైతులు సంప్రదాయ ఎరువులకు బదులు నానో ఎరువులను వినియోగించడం ఉత్తమమని మండల వ్యవసాయ అధికారి భూమా జ్యోతి సూచించారు. మంగళవారం మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ప్రారంభించి రైతులకు నానో ఎరువుల వినియోగంపై క్షేత్రస్థాయిలో ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నానో ద్రావణాల వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని తెలిపారు. నానో యూరియాతో అధిక దిగుబడితోపాటు సమర్థవంతమైన వినియోగం సాధ్యమవుతుందని వివరించారు. ఇఫ్కో జిల్లా మేనేజర్ మధుసూదన్, ఏఈఓ శ్రీకాంత్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఐగా ఎంపికైన పూర్వ విద్యార్థికి సన్మానం


చెన్నయ్యను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: కైప గ్రామానికి చెందిన జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కె. చెన్నయ్య పోలీసు శాఖలో ఎస్‌ఐగా ఎంపికై సత్యసాయి జిల్లాకు నియమితుడవడంతో మంగళవారం ఆయనకు ఘన సన్మానం చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రఘునాథ్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. చిన్న గ్రామం నుంచి ఎంతో కృషితో ఎస్‌ఐ ఉద్యోగాన్ని సాధించిన చెన్నయ్యను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్య, పట్టుదల ఉంటే ఏ లక్ష్యమైనా చేరవచ్చని తెలిపారు. చెన్నయ్యకు దుశ్శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎం.రామమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, సజ్జాద్, వీరయ్య ఆచారి, స్వామన్న, లత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సేవలు దూరం

- రైతు సేవా కేంద్రాల కుదింపు
- రెండు, మూడు కలిపి విలీనం
- 13 నుంచి 7కు కుదించిన ప్రభుత్వం



వృథాగా మారిన కొలిమిగుండ్లలోని రైతు సేవా కేంద్రం

కొలిమిగుండ్ల: వ్యవసాయ సంబంధ సేవలను రైతుల ముంగిటకే తీసుకెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతుల అన్ని సమస్యలు పరిష్కరించేందుకు ఆర్‌బీకేలు అప్పట్లో ఎంతోగానో ఉపయోగపడ్డాయి. రైతులకు స్థానికంగానే విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, సబ్సిడీ విత్తనాలు తదితర సేవలు సులభతరంగా అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చారు. రేషనలైజేషన్‌లో భాగంగా పాఠశాలల తరహాలో వీటిని సైతం విలీనం చేపట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొలిమిగుండ్ల మండలంలో 13 ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. లక్షలు విలువ చేసే అధునాతన సాంకేతిక సాయంతో పని చేసే కియోస్కోలను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం తాజాగా రైతు సేవా కేంద్రాలను 13 నుంచి ఏడుకు కుదించింది. మిగిలిపోయిన ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం మండలంలో కొలిమిగుండ్ల, చింతలాయిపల్లె, పెట్నికోట, నందిపాడు, బిఉప్పలూరు, తోళ్లమడుగు, పెద్దవెంతుర్ల గ్రామాల్లో మాత్రమే రైతు సేవా కేంద్రాలు పని చేస్తున్నాయి. కొలిమిగుండ్లలో రెండు ఉండగా ప్రస్తుతం ఒకటి చేశారు. బెలుం శింగవరం, బెలుం, మీర్జాపురం గ్రామాల రైతులు కొలిమిగుండ్లకు రావాల్సి రావడంతో ఇబ్బందులు తప్పవని రైతులు వాపోతున్నారు. మిగిలిన గ్రామాల రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. గతంలో ఏచిన్న పని అయినా స్థానికంగానే సులభంగా జరిగిపోతుండేదని గుర్తు చేసుకుంటున్నారు. విలీనం చేశాక సుదూరంగా వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. క్రాప్ బుకింగ్ ఆధారంగా పంట సాగు విస్తీర్ణం తక్కువగా ఉందనే నెపంతో రైతు సేవా కేంద్రాలను కుదించారనే ఆరోపణలు ఉన్నాయి.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

సంజామల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శక్తి టీం ఆధ్వర్యంలో సీఐ హనుమంత్ నాయక్ పోక్సో యాక్ట్ సహా పలు చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని అనుకున్న లక్ష్యాన్ని ఛేదించాలన్నారు. సైబర్ నేరాలు పెరిగిపోయాయని.. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్, మేసేజ్‌లు, ఓటీపీలను ఎట్టిపరిస్థితుల్లో చెప్పకూడదని తెలిపారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. బాలికలు, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐ రమణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ సులేహ బేగ్, శక్తిటీం ఏఎస్‌ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


మాట్లాడుతున్న డీపీఓ లలితాబాయి

బేతంచెర్ల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీపీఓ లలితాబాయి అన్నారు. మంగళవారం బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. సూపరింటెండెంట్ దస్తగిరిబాబు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడమే కాకుండా, వీధులు, డ్రైనేజీ కాల్వలు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. వీధిలైట్లు ఏర్పాటుతో పాటు పైపులైన్ లీకేజీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ఇంటి పన్నులు వసూలు చేయాలని, ఏడాదికి ఒకసారి కాకుండా 6 నెలలకు ఒకసారి చెల్లించేలా చూడాలన్నారు. ఈఓఆర్డీ మల్లికార్జున పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈగా మద్దిలేటి

కోవెలకుంట్ల: గృహ నిర్మాణ శాఖ కోవెలకుంట్ల మండల ఇన్‌చార్జ్ ఏఈగా మద్దిలేటిని నియమించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన రమణారెడ్డి గతనెలాఖరున పదవీ విరమణ పొందారు. ఆ స్థానంలో కొలిమిగుండ్ల మండలంలో ఏఈగా పనిచేస్తున్న మద్దిలేటికి ఇక్కడ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ పథకం కింద పక్కాగృహాలు మంజూరై వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

కొలిమిగుండ్లలో మోస్తరు వర్షం

కొలిమిగుండ్ల: అల్పపీడన ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం సాయంత్రం కొలిమిగుండ్ల మండలంలోని పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. కాగా మూడు రోజుల నుంచి తేలిక పాటి వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటి వరకు భారీ వర్షపాతం నమోదు కాలేదు. మండలంలో ఐదు చెరువులు నీళ్ల లేక ఖాళీగా ఉన్నాయి. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసేందుకు అవసరమైన వర్షాలు కురవడంతో కొంత మేర ఉపశమనం లభించింది. మొక్కజొన్న, మినుము తదితర పంటలకు తడులు అందాయి. భారీ వర్షం కురిస్తే తప్ప బోర్లలో భూగర్భ జలాలు పెరగవని రైతులు అంటున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

డోన్ టౌన్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో వారి నుంచి ఫిర్యాదులు, సలహాలు స్వీకరించడానికి బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య 9959225795 నంబర్‌కు కాల్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

బనగానపల్లె రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎనలేనివని మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధిక అన్నారు. మంగళవారం మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ పలుకూరులో 45 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. వెంకటేశ్వర స్వామి భక్త మండలి సహకారంతో వీటిని అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిత్యం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దుస్తులు పంపిణీ చేసిన భక్త మండలి సభ్యులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మనంద ఆచారి, సర్పంచ్ సుమలత, బీసీ సంఘం నాయకులు శంకర్, జాన్, ఈఓ బాలాంజనేయులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

ప్యాపిలి: సేంద్రియ ఎరువులను విరివిగా వాడి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ సునీత తెలిపారు. ప్యాపిలి, పోతుదొడ్డి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. రసాయనిక ఎరువులు వాడితే పెట్టుబడి వ్యయం పెరగడంతో పాటు భూసారం తగ్గిపోతుందన్నారు. పంటలు సాగు చేయడానికి ముందు భూసార పరీక్షలు, విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. చీడపీడల నివారణకు వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలన్నారు. ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి, ఏఓ రాజేష్ పాల్గొన్నారు.

పేదలకు మార్గదర్శుల తోడ్పాటు అవసరం


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ దస్తగిరిబాబు

బేతంచెర్ల: పీ4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాలను ఆదుకోవడంలో మార్గదర్శులు కీలక పాత్ర పోషించాలని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, సూపరింటెండెంట్ దస్తగిరి బాబు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ మల్లికార్జున ఆధ్వర్యంలో మార్గదర్శులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో 1213, పట్టణంలో 385 బంగారు కుటుంబాలను గుర్తించామని వెల్లడించారు. ఈ కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు మార్గదర్శులు తోడ్పాటు అందించాలని కోరారు.

వారి జీవితాల్లో వెలుగులు నింపడం ద్వారా రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో డీటీ మారుతి, ఎంఈఓ సోమశేఖర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి మంగళవారం వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 112, పోక్సో, సైబర్ నేరాల టోల్‌ఫ్రీ నంబర్ 1930, తదితర చట్టాల గురించి తెలియజేశారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితవ్యక్తులు ఫోన్, వాట్సాప్‌కాల్ ద్వారా వ్యక్తిగత బ్యాంకు ఖాతా, ఆధార్, ఓటీపీ తదితర వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదన్నా రు. హెచ్‌ఎం ఓబులయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఆరోగ్య జీవితం సాధ్యం



వైద్యులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

డోన్: క్రమశిక్షణను అలవర్చుకుంటేనే ఆరోగ్యంగా జీవించగలమని రోటరీక్లబ్ అధ్యక్షుడు జింకల కృష్ణ, కార్యదర్శి బలరాం పేర్కొన్నారు. వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా స్థానిక రోటరీక్లబ్ ఆవరణలో మన చేతుల్లో మన ఆరోగ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలని సూచించారు. హెల్త్ అవేర్నెస్ కోసం నవ్య, శ్రీగౌరి ఆస్పత్రుల అధినేతలు డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్‌లు చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. వారిని ఘనంగా సత్కరించారు. క్లబ్ సభ్యులు రాజా విజయ్‌కుమార్, జగన్‌మోహన్, నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, దశరథ రామిరెడ్డి, శంకర్‌గౌడ్, మారెల్ల రాజశేఖర్ రెడ్డి, గంగిరెడ్డి, లక్ష్మిరెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

బనగానపల్లె: రైతులు పంటల సాగుకు మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. పసుపల, పాతపాడు గ్రామాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ పథకాలను వివరించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


ఆశ్రమ ఆవరణలో మొక్కలు నాటుతున్న సభ్యులు

కోవెలకుంట్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎం. గోవిందిన్నె మెట్ట సమీపంలోని ఓం నమోనారాయణాయ ఆశ్రమం ఆవరణలో వివిధ రకాల పండ్లు, పూల మొక్కలు నాటారు. అడవులు అంతరించిపోతున్న నేపథ్యంలో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం నెలకొందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచి పెద్ద చేయాలన్నారు. ప్రకృతి పీఠం సభ్యులు నారాయణరెడ్డి, సుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, ఈశ్వరమ్మ, నాగేశ్వరి పాల్గొన్నారు.

యూట్యూబర్లపై డీఎస్పీకి ఫిర్యాదు

డోన్ టౌన్: అనధికారికంగా వీడియోలు, ఫొటోలు తీస్తూ విధులకు ఆటంకం కలిగిస్తున్న యూట్యూబ్ చానళ్లపై మండల సర్వేయర్ జగదీష్‌కుమార్ మంగళవారం డోన్ డీఎస్పీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ సర్వేయర్లతో కలిసి రీసర్వే పనులు చేస్తుండగా అవులదొడ్డి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, మరో ముగ్గురు యూట్యూబర్లు అసత్య ఆరోపణలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ. 250 కోట్లకు బ్యాంకు లావాదేవీలు


మాట్లాడుతున్న కో-ఆపరేటివ్ బ్యాంకు సీఈఓ కృష్ణమూర్తి

కోవెలకుంట్ల: కో-ఆపరేటివ్ బ్యాంకు వివిధ బ్రాంచ్‌ల ద్వారా రూ. 250 కోట్ల లావాదేవీలతో కార్యకలాపాలు కొనసాగుతున్నాయని ఆ బ్యాంకు సీఈఓ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి కల్యాణ మండపంలో మంగళవారం బ్యాంకు 58వ మహాజన సభ్యుల సమావేశం నిర్వహించారు. ముందుగా బ్యాంకు వ్యవస్థాపకుడు సముద్రాల వెంకటనారాయణశెట్టి 5వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్యాంకు నాలుగు బ్రాంచ్‌లలో ఖాతాదారులు లావాదేవీలను వినియోగించుకుంటున్నారన్నారు. ఇతర బ్యాంకులతో పోల్చుకుంటే తమ బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. ఖాతాల అనుసంధానంగా ఫోన్‌పే, గూగుల్‌పే, మొబైల్ బ్యాంకింగ్, తదితర డిజిటల్ సేవలను అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాంకు అధ్యక్షుడు శ్రీనివాసరావు, మేనేజర్ విక్రమ్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో యూటీఎఫ్ నేతలు

ప్యాపిలి: పదోన్నతిపై వచ్చిన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని మండల విద్యాధికారి వెంకటేశ్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పదోన్నతిపై వచ్చిన ఉపాధ్యాయులతో పాటు ఉత్తమ సీఆర్పీ రామాంజేయులును సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులను విద్యార్థులు, తల్లిదండ్రులు ఎప్పటికీ మరచిపోరని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సర్వజ్ఞమూర్తి, రఘునాయక్, శాంతిప్రియ, అబ్దుల్ లతీఫ్, గోపాల్, లక్ష్మీనాయక్, రమేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై అవగాహన


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

డోన్ టౌన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చిన్నమల్కాపురం వైద్యశాల డాక్టర్ చెన్నకేశవులు అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ చేరడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. దీంతో మలేరియా, డెంగీ, విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి, చెన్నయ్య, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్యాక్స్ చెల్లించని మినీ బస్‌పై జరిమానా


రికార్డులు పరిశీలిస్తున్న ఎంవీఐ క్రాంతికుమార్

ప్యాపిలి: స్థానిక జాతీయ రహదారిపై డోన్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. గోవా రాష్ట్రానికి చెందిన జీఏ 07టీ3195 నంబర్ గల మినీ బస్ రికార్డులు పరిశీలించారు. ఏపీకి చెల్లించాల్సిన రోడ్ ట్యాక్స్ చెల్లించలేదని గుర్తించి మినీ బస్‌కు రూ. 53,000 జరిమానా విధించారు. అలాగే ఓవర్ లోడ్‌తో వెళ్తున్న పలు వాహనాలకు రూ. 35 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ట్యాక్స్‌లు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆత్మహత్యకు యత్నించిన యువతి మృతి

డోన్ టౌన్: కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. రూరల్ సీఐ రాకేష్ వివరాల మేరకు..మండలంలోని గోసానిపల్లెకు చెందిన రామచంద్రుడు, మహేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె గౌతమి(21) కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ నెల 16న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం గ్రామానికి చెందిన కంబగిరిరాముడు(45) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. మృతుడు కూలి పనులకు పోతుండేవాడు. మద్యానికి అలవాటు పడి తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడుతుండేవాడు. ఈక్రమంలోనే మనస్తాపానికి లోనై ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావణం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి అవుకులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడే కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బేతంచెర్ల: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొని తల్లీకుమారుడు తీవ్రంగా గాయపడిన ఘటన బేతంచెర్ల సమీపంలోని బనగానపల్లె రహదారిలో మంగళవారం జరిగింది. మండల పరిధిలోని బైనపల్లె గ్రామానికి చెందిన తల్లీకొడుకు, సాలమ్మ, మణికంఠ ద్విచక్రవాహనంపై బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి వెళ్లి తిరిగి గ్రామానికి బయలుదేరారు. బేతంచెర్ల పట్టణ సమీపంలో ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాలమ్మ, మణికంఠ తీవ్రంగా గాయపడడంతో బేతంచెర్ల ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: మండలంలోని కోవెలకుంట్ల-నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉన్న రేవనూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ భూపాలుడు మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర ప్రాంతాలవైపు వెళుతున్న వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహనచోదకులకు జరిమానా విధించారు.

నగరవనం సందర్శన

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నూతనంగా ఏర్పాటు చేస్తున్న నగర వనాన్ని జిల్లా అటవీశాఖ అధికారిణి నాగమునేశ్వరి మంగళవారం సందర్శించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఔషధ మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు చెట్ల ఆవశ్యకతను తెలియజేయాలన్నారు.

పరామర్శ

బనగానపల్లె రూరల్: మండలంలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇటిక్యాల చిన్నపుల్లయ్య భార్య లక్ష్మీ నారాయణమ్మ ఈ నెల 14న అనారోగ్యంతో మృతిచెందింది. ఆ కుటుంబాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, పుల్లయ్య, గడ్డం బాషా తదితరులు ఉన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: కడప మున్సిపల్ మైదానంలో రెండు రోజుల క్రితం జరిగిన నాల్గవ సౌత్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కోవెలకుంట్లకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సంస్కృత పాఠశాల ఆవరణలో విజేతలకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి దాదాపు 500 మంది పోటీల్లో పాల్గొన్నారు. పట్టణానికి చెందిన లీలామాధురి బంగారు పతకం సాధించింది. రియా తుబసుం, సురేష్‌రెడ్డి, చెర్రీ వెండిపతకాలు కైవసం చేసుకున్నారు. క్రీడాకారులను రిటైర్డ్ హెచ్‌ఎం జీవీ సుబ్బారెడ్డి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేష్, కరాటే కోచ్ సుధీర్ తదితరులు అభినందించారు.

అనవసర యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేయొద్దు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ

ప్యాపిలి: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ మధుసూదన్ అన్నారు. మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామంలో మంగళవారం పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్‌లో అనవసరమైన యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని సూచించారు. వాట్సాప్‌లో వచ్చే ఏపీకే ఫైల్స్ వంటి మోసపూరిత అప్లికేషన్లు తెరవకూడదన్నారు. బ్యాంకు ఖాతా నుంచి తమకు తెలియకుండానే డబ్బులు మాయం అయినట్లు గుర్తిస్తే సంబంధిత బ్యాంకు అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర సమయాల్లో 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.